సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం | 8 | ఆగస్టు | 2024



మిడ్‌మానేరులో 17 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో బుధవారం 17.06 టీఎంసీలకు నీరు చేరింది. ఎల్లంపల్లి నుంచి ఇన్‌ఫ్లో 6,500 క్యూసెక్కులు, అనంతగిరికి 6,400 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది.



మొక్కలు పెంచాలి

సిరిసిల్లటౌన్: మొక్కలను బాధ్యతగా పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం మొక్కలు నాటారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/24.0

జిల్లాలో తేలికపాటి వర్షపు జల్లులు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

గుండెనొప్పంటే.. సర్జరీనే!

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు	
కరీంనగర్	286
సిరిసిల్ల	110
పెద్దపల్లి	120
జగిత్యాల	75



- పేషెంట్ పరిస్థితి అదుపులో ఉన్నా.. ఆపరేషన్‌కు సమయం ఉన్నా పట్టించుకోని కొందరు వైద్యులు
- 'ఆరోగ్యశ్రీ' వచ్చేవరకు ఆగితే ముప్పంటూ స్టంట్లు, శస్త్రచికిత్సలు
- అప్పులపాలవుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- గత జనవరి నుంచి దాదాపు 2,100 గుండె చికిత్సలు
- ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల దందా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఎవరైనా గుండెనొప్పంటూ దవాఖానాకు వెళ్తే.. వెంటనే ఆపరేషన్లు చేసేస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉంటే పర్వాలేదు. పేషెంట్ పరిస్థితి అదుపులోనే ఉండి, ఆపరేషన్ చేయడానికి లేదా స్టంట్ వేయడానికి తగినంత సమయం ఉన్నా, ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని తెలిసినా పట్టించుకోవడం లేదు. అందరినీ ఎమర్జెన్సీ కింద లెక్కగట్టి, స్టంట్లు వేయడం, ఆపరేషన్ చేస్తున్నారు. దీంతో ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకం కింద అందాల్సిన గుండె వైద్యం కాస్తా.. ఖరీదుగా మారింది. పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల చేసి మరీ బిల్లు కడుతున్నారు. గత జనవరి నుంచి జూలై వరకు ఉమ్మడి జిల్లాలో జరిగిన గుండె చికిత్సల(స్టంట్లు, ఆపరేషన్లు) సంఖ్య దాదాపు 2,100 అంటే దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

కరోనా తర్వాత పెరిగిన సమస్యలు..

కరోనా తర్వాత గుండె సంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయి. మనుషులు ఉన్నట్లుండి గుండెనొప్పితో కుప్పకూలుతున్నారు. బాధితుల్లో చాలామంది వెంటనే చనిపోతున్నారు. దీంతో గుండె సంబంధిత ఏ సమస్య తలెత్తినా ప్రతిఒక్కరూ వణికిపోతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణంగా గుండె నరాల్లో బ్లాకులు ఏర్పడి, స్టంట్ వేయాల్సి రావడం లేదా బైపాస్ సర్జరీ తదితర సమస్యలతో పేషెంట్ ఆస్పత్రి గడప తొక్కితే.. ఎమర్జెన్సీ కేసుల కింద చూపి, వైద్యులు ఆపరేషన్ చేయాలంటున్నారు. ఆరోగ్యశ్రీ వచ్చే వరకు ఆగితే ప్రాణాలకే ముప్పంటూ ఆందోళనకు గురిచేస్తున్నారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు అప్పులు చేసి మరీ శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. సాధారణంగా ఆరోగ్యశ్రీ కింద ఒక స్టంట్ వేసినప్పుడు సుమారు రూ.60 వేలు, రెండు వేయాల్సి వస్తే.. రూ.లక్ష వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అదే ప్రైవేటు ఆస్పత్రివారే చేస్తే ఒక స్టంట్‌కు రూ.2 లక్షలు, రెండింటికి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారు. ఓపెన్‌హార్ట్ సర్జరీ వంటి వాటికి ఆరోగ్యశ్రీ కింద రూ.1,18,000 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ, కొన్ని ఆస్పత్రులు రోగి కుటుంబసభ్యులను కంగారు పెట్టి, ఆపరేషన్ చేసి, రూ.3 లక్షలు మొదలుకొని.. నచ్చినట్లు బిల్లులు వేస్తున్నాయి.

బాధితులు ఏం చేయాలి?

ఇలాంటి కేసులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. సాధారణంగా ఆరోగ్యశ్రీ కింద పేద ప్రజలే గుండె జబ్బులకు చికిత్స పొందుతారు. అలాంటివారు తాము మోసపోయామని అనుమానం వస్తే.. వెంటనే సమీపంలోని ఆరోగ్య మిత్ర, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ లేదా ఆరోగ్యశ్రీ సీఈవోకు ఫిర్యాదు చేయవచ్చు. విచారణలో ఆస్పత్రిది తప్పిదమని తేలితే ఆపరేషన్ ఖర్చుకు 20 రెట్ల జరిమానా విధిస్తారు. అలాగే, హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేస్తారు. పరిస్థితిని బట్టి ఆపరేషన్ చేసిన వైద్యుడి డిగ్రీ కూడా రద్దవుతుందని సీనియర్ డాక్టర్లు చెబుతున్నారు.

ఇది అన్యాయం



అసవరం లేకున్నా స్టంట్స్ వేయడం, ఆపరేషన్ చేయడం వంటి ఫిర్యాదులు మా దృష్టికి వస్తున్నాయి. ఇది అన్యాయం. సాధారణంగా ఆరోగ్యశ్రీ కింద చికిత్స కోసం పేదవారే వస్తారు. అలాంటి వారిని తప్పుదోవ పట్టించడం సరికాదు. పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు శస్త్రచికిత్స చేయడం సబబే. కానీ, అన్నింటినీ ఎమర్జెన్సీ కింద జమకట్టి, పేదలను అప్పులపాలు చేయడం ఏమాత్రం సమంజసం కాదు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ బీఎస్.రావు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు

అప్రూవల్ వచ్చేదాకా ఆగాలి



హార్ట్‌స్ట్రోక్ వచ్చినప్పుడు ఎమర్జెన్సీ అయితే ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా చికిత్స అందించాలి. ఎమర్జెన్సీ కానప్పుడు ఆరోగ్యశ్రీ అప్రూవల్ వచ్చే వరకు ఆగాలి. ఆ పథకం పెట్టిందే నిరుపేదల కోసం. వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేయాలి. ప్రభుత్వ అధికారులు గుండెకు సంబంధించిన కేసులకు వీలైనంత త్వరగా అప్రూవల్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ రాంకిరణ్, ఐఎంఏ అధ్యక్షుడు, కరీంనగర్

ఆధునీకరణే ఆధారం



నేతకార్మికుడిని సన్మానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, కేకే మహేందర్‌రెడ్డి

- ప్రభుత్వం సహకరిస్తుంది
- మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం
- చేనేత కార్మికులకు సన్మానం



చేనేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగాటెక్నాలజీని వినియోగించుకుంటూ.. పరిశ్రమను ఆధునీకరిస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. స్థానిక నేతకళాకారులకు మంచి నైపుణ్యం ఉందన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసిన చరిత్ర సిరిసిల్ల నేతన్నలకే సొంతమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఎప్పటిలాగే కొనసాగుతాయని స్పష్టం చేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా సిరిసిల్లకొచ్చి 12వేల అంత్యోదయ కార్డులు అందించారని, మెగా వైద్యశిబిరం నిర్వహించారని, విద్యుత్ సబ్సిడీని మరింత పెంచుతామని చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం బకాయిలు పెట్టిన డబ్బులను ఇప్పించే ప్రయత్నం చేశామన్నారు. సిరిసిల్లలో మగ్గాలను ఆధునీకరించుకోవాలని, టెక్స్‌టైల్‌పార్క్, అపెరల్ పార్క్‌ల్లోనూ మెరుగైన ఉపాధి కల్పిస్తామని, యువ పారిశ్రామికవేత్తలకు అపెరల్ పార్క్‌లో అవకాశం కల్పిస్తామన్నారు.

సిరిసిల్లకు మంత్రుల బృందం

సిరిసిల్లకు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యార్ త్వరలో వస్తారని తెలిపారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు సిరిసిల్లకు వస్తాయని, వాటిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారన్నారు. ప్రభుత్వం ఎన్ని చేసినా టెక్నాలజీని పెంచుకొని మార్కెట్‌లో పోటీపడేలా వస్త్రపరిశ్రమ ఎదగాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, జౌళిశాఖ ఏడీ సాగర్, కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్‌నగర్‌లోనూ చేనేత వేడుకలకు హాజరయ్యారు.

చేనేత కార్మికులు సన్మానం

బీ.వై.నగర్ జౌళిశాఖ ఆఫీస్ నుంచి నేతన్నలు ర్యాలీ తీశారు. పాతబస్టాండులోని నేతన్నచౌక్ వద్ద కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి చేనేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. షాదీఖానాలో చేనేత కార్మికులను సన్మానించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్)లో రూ.2.60కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా నేత కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు.

న్యూస్‌రీల్

నష్టాల్లో ఉన్నా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ: రాష్ట్రంలో రూ.80వేల కోట్లకు పైగా విద్యుత్‌శాఖకు బకాయిలు ఉన్నా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 4వ వార్డులో తుప్పు పట్టిన, ప్రమాదకరంగా ఉన్న 34 స్తంభాలను తొలగించి కొత్త వాటిని వేసేందుకు బుధవారం భూమిపూజ చేశారు. సెస్ ఇబ్బందులను అధిగమించేందుకు పాలకవర్గంతో మాట్లాడినట్లు తెలిపారు. రుద్రవరం పరిధిలో సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. లోవోల్టేజీ సమస్య, సరఫరాలో అంతరాయాన్ని నివారించేందుకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌లో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. కథలాపూర్‌లో 220 కేవీ, పోసానిపేటలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు తెలిపారు.

కస్టమ్ మిల్లింగ్ పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సిరిసిల్ల: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఖరీఫ్, రబీ సీజన్ 2023–24 లక్ష్యాన్ని సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి హైదరాబాద్ నుంచి జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సీఎమ్మార్ గడువు పెంచేది లేదని స్పష్టం చేశారు. రబీ సీజన్ వడ్లు గడువులోగా అందించేలా రైస్‌మిల్లర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. రబీ 2022–23 ధాన్యాన్ని వేలంలో దక్కించుకున్న వారు నెలరోజుల్లోగా తీసుకెళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.


ఓపెన్ విద్యార్థులకు నాణ్యమైన విద్య



వేములవాడఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు స్టూడెంట్ సర్వీస్ బ్రాంచ్ జాయింట్ డైరెక్టర్ ఇటిక్యాల రాజేందర్‌రెడ్డి తెలిపారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని దూరవిద్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ దూరవిద్య కేంద్రంలో 2024–25కు అన్ని కోర్సుల్లో అడ్మిషన్ల స్వీకరణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అధ్యాపకులు శంకర్, నర్సయ్య, పద్మ, లావణ్య ఉన్నారు.

కోడి పిల్లల పెంపకంపై దృష్టి పెట్టండి

- ఐకేపీ డీపీఎం పద్మయ్య



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్వయం సహాయక సంఘాల మహిళలు కోడిపిల్లల పెంపకంపై దృష్టి పెట్టాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా ఆలోచనలు చేయాలని ఐకేపీ డీపీఎం పద్మయ్య, జిల్లా ఏపీఎం రాజేశం, మండల పశువైద్యాధికారి రేణుక కోరారు. ఎల్లారెడ్డిపేటలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మహిళలకు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం, సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, సుదర్శన్, రమణ, పద్మ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయండి

- జిల్లా ప్రత్యేకాధికారి శృతి ఓఝా
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి శృతి ఓఝా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి శృతి ఓఝా కోరారు. స్వచ్ఛదనం–పచ్చదనంపై కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు, వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో ఆగస్టు 5, 6 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో తీసుకున్న చర్యలు, రూపొందించుకున్న ప్రణాళికలపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివరించారు. శృతి ఓఝా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడుతుందని, పచ్చదనంతో కాలుష్యం తగ్గుతుందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్‌తోపాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రత, పచ్చదనం పెంపొందేలా తీర్చిదిద్దాలని కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం తాగునీటి సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం, డ్రెయినేజీల పనులు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణకు చర్యలు, డ్రైడే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలన్నారు. వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రమేశ్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి వసంతరావు, డీఈవో రమేశ్‌కుమార్, డీఏవో భాస్కర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, మిషన్ భగీరథ ఈఈ జానకి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా మైనింగ్ అధికారి క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీబేగ్, అన్వేశ్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలో సీసీ రోడ్డు పనులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికులు పలువురు కలెక్టర్‌కు తమ ప్రాంతంలోని సమస్యలు ఏకరువు పెట్టారు. అన్నింటిని సానుకూలంగా విన్న కలెక్టర్‌కు వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యువకుడు లింబాద్రి విన్నపం మేరకు ఎస్‌ఆర్ పెట్రోల్‌పంపు సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బ్రిడ్జి పనులు పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

నిఘా పెట్టి కట్టడి చేస్తాం

- చంద్రగిరి 'గుట్టల గుల్లా'పై మైనింగ్ ఏడీ స్పందన

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: సిరిసిల్ల–వేములవాడ పట్టణాల మధ్యలోని చంద్రగిరి గుట్టల్లో అక్రమ మొరం తవ్వకాలపై నిఘా పెట్టి నిరోధిస్తామని గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు ఎస్.క్రాంతికుమార్ బుధవారం తెలిపారు. వేములవాడఅర్బన్ మండలం చంద్రగిరి గుట్టల్లో అక్రమంగా తవ్వకాలు సాగుతున్నాయని, గుట్టలకు ముప్పు పొంచి ఉందంటూ 'గుట్టలు గుల్లా' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమతవ్వకాలు చేసే అక్రమార్కులు అప్రమత్తమై టిప్పర్లను, హిటాచీ మిషనరీని గుట్టల నుంచి తరలించారు. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తనిఖీలు చేస్తున్నామని, ఇప్పటి వరకు ఈ ఏడాదిలో 28 కేసులు నమోదు చేసి రూ.1.14 లక్షలు జరిమానా వసూలు చేశామని మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ తెలిపారు. వేములవాడ అర్బన్ రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో చంద్రగిరి గుట్టల్లో నిఘా ఉంచి అక్రమ మొరం తవ్వకాలను కట్టడి చేస్తామని వెల్లడించారు. మైనింగ్‌శాఖలో ఒక్కరే క్షేత్రస్థాయి సిబ్బంది ఉండడంతో ఇసుక, కంకర, మట్టి, మొరం వంటి ఖనిజాల అక్రమ తవ్వకాలు, రవాణాను నిరోధించడం కష్టంగా ఉందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్‌శాఖలు సంయుక్తంగా నిఘా ఉంచి గుట్టల్లో అక్రమ తవ్వకాలను నిరోధిస్తామని వెల్లడించారు.

జిల్లా సీఏవోగా రమణారావు



వేంకట రమణారావు

సిరిసిల్లకల్చరల్: జిల్లా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(సీఏవో)గా ఉప్పల వేంకటరమణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాపీయిస్ట్‌గా ఉద్యోగ జీవితం ఆరంభించిన ఆయన, ఇన్నాళ్లు సూపరింటెండెంట్‌గా కొనసాగారు. తాజాగా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పలువురు పలువురు న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు అభినందించారు.

వాక్ ఫర్ ఇన్నోవేషన్



సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటింటా ఇన్నోవేషన్–2024 ప్రచారంలో భాగంగా బుధవారం సిరిసిల్లలో 'వాక్ ఫర్ ఇన్నోవేషన్' నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఈడీఎం శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ అనిల్ పాల్గొన్నారు.

గుండారంలో సింగాపూర్ బౌద్ధమత ప్రచారకులు

- జగదాంబమాత దర్శనం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలోని గిరిజనుల ఆరాధ్య దైవం జగదాంబమాతను సింగాపూర్‌కు చెందిన బౌద్ధమత ప్రచారకులు బుధవారం దర్శించుకున్నారు. ఆరుగురు సభ్యులతో కూడిన బృందం గుండారం గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామస్తులకు బుద్ధుని ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ ఇంటి వద్ద భోజనం చేసి సిరిసిల్లకు బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో బౌద్ధమతం వ్యాప్తి గురించి తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలుస్తోంది.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- మహిళల భద్రతే మొదటి ప్రాధాన్యం
- నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- విద్యార్థులతో ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం విద్యార్థులకు మహిళల రక్షణ, షీటీమ్స్, ఈవ్‌టీజింగ్, పోక్సో, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినిలు, మహిళలు వేధింపులకు గురైతే షీటీమ్ 87126 56425 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతయే తమ మొదటి ప్రాధాన్యమన్నారు. మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌కు దూరంగా ఉండాలన్నారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ కృష్ణ, షీటీం ఏఎస్సై ప్రమీల పాల్గొన్నారు.

నల్లమాస్కులతో న్యాయవాదుల నిరసన



సిరిసిల్లలో ర్యాలీ తీస్తున్న న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్/వేములవాడ: కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకుండా న్యాయవాదులపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసుల వైఖరిని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని అడ్వకేట్లు నల్లమాస్కులు ధరించి నిరసన తెలిపారు. కోర్టు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి, సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయస్థానాలను గౌరవించాల్సిన పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్నారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు విధుల బహిష్కరణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాదులు ఆవునూరి రమాకాంత్‌రావు, బొంపెల్లి రవీందర్‌రావు, తంగళ్లపల్లి వెంకటి, గోవిందు భాస్కర్, సబ్బని రవీందర్, నాగరాజు, కిషన్, బిట్ల విష్ణు, భువనేశ్వర్, అన్నల్‌దాస్ వేణు, గుండెల్లి శశాంక్ పాల్గొన్నారు. వేములవాడలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, కోర్టు గేట్ ఎదుట నిరసన తెలిపారు. గుడిసె సదానందం, అవదూత రజనీకాంత్, నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, కిశోర్‌రావు, విద్యాసాగర్‌రావు, ప్రతాప సంతోష్, పురుషోత్తం, పిట్టల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. కోనరావుపేట మండలం కొలనూర్‌ను బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యదర్శి మొయిజ్, అంగన్‌వాడీ టీచర్ మల్లీశ్వరీ, ఏఎన్‌ఎం తిరుమల, సీసీ రవి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

బుగ్గారం(ధర్మపురి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బుగ్గారం మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన కలమడుగు వెంకయ్య(79) బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తన ఇంటి ఎదుట జాతీయ రహదారి–63కు అవతలి వైపు ఉన్న కిరాణా దుకాణానికి వెళ్తున్నాడు. అదే సమయంలో జగిత్యాల నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకయ్య తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన బొద్దుల శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ బుధవారం బైక్‌పై గుండేడు గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ హఠాత్తుగా హారన్ కొట్టాడు. శ్రీనివాస్ ఉలిక్కిపడటంతో బైక్ అదుపుతప్పి, పడిపోయింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

వైన్స్‌లో చోరీ కేసు నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని వైన్స్‌లో చోరీ కేసు నిందితుడిని అరెస్టు చేశామని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు. బుధవారం ఉజ్వల పార్కు వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా మహారాష్ట్రకు చెందిన దుర్వ అజయ్, అతని ఇద్దరు అనుచరులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని, విచారించగా కరీంనగర్‌లోని మానస వైన్స్‌లో దొంగనతం చేసినట్లు, మహాలక్ష్మి వైన్స్‌లో చోరీకి యత్నించినట్లు అజయ్ ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని అరెస్టు చేసి, రూ.20 వేలు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో దొంగలించిన ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నేరస్తుడికి ఏడాదిన్నర జైలు

సిరిసిల్ల క్రైం: చోరీ కేసులో నేరస్తుడికి ఏడాదిన్నర జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ తీర్పు వెల్లడించారని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల కార్గిల్ చెరువు సమీపంలో గల కట్ట మైసమ్మ గుడిలో పనిచేసే శ్రీనివాస్ గత ఫిబ్రవరి 27న రాత్రి ఆలయానికి తాళం వేసి, వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు గుడి వద్దకు రాగా తాళం పగులగొట్టి ఉంది. హుండీలో ఉన్న రూ.7 వేలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సిరిసిల్ల విద్యానగర్‌కు చెందిన కోడం లక్ష్మణ్ అలియాస్ లకన్‌ను అరెస్టు చేశారు. విచారణ అధికారి పి.శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ వేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ లక్ష్మణ్‌ను బుధవారం కోర్టులో ప్రవేశపెట్టగా నేరాన్ని అంగీకరించాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష ఖరారు చేశారు.

ప్రైవేటు ప్రీ ప్రైమరీ స్కూళ్ల మూసివేత

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని వేములకుర్తి, గోధూర్‌లలో అనుమతి లేని ప్రైవేటు ప్రీ ప్రైమరీ స్కూళ్లను ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు బుధవారం మూసివేయించారు. వేములకుర్తి న్యూ విజన్ పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న 24 మందిని, గోధూర్ మాస్టర్ కాన్వెంట్ స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులను ఇంటికి పంపించి, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు.

చేపపిల్లలు వదిలేదెప్పుడో?

- ఏటా ఆగస్టులో చేప పిల్లల విడుదల
- ఈసారి ఖరారుకాని టెండర్లు
- ముందుకురాని ఏజెన్సీలు
- పెండింగ్‌లోనే గతేడాది బిల్లులు



చేపపిల్లలు విడుదల చేస్తున్న అధికారులు (ఫైల్)

బోయినపల్లి: మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చెరువులు, ప్రాజెక్టుల్లో చేపపిల్లలను వదులుతుంది. ఏటా ఆగస్టు నెలలోనే చెరువుల్లో వదులుతూ మత్స్యకారులకు ఉపాధిపై భరోసానిస్తుంది. అయితే ఈసారి ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో చేపపిల్లల పంపిణీపై స్పష్టత రావడం లేదు. రొయ్యపిల్లలు వదలడానికి ప్రభుత్వం ఇంకా టెండర్లూ పిలవలేదు. ఇప్పటికే అదును దాటుతోందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఎగువ, మధ్యమానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులతోపాటు 440 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 138 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా.. 8,800 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు.

టెండర్లకు ముందుకురాని ఏజెన్సీలు

జిల్లాలోని మిడ్‌మానేరు, అప్పర్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులతో పాటు సుమారు 400కు పైగా చెరువుల్లో 1.40 కోట్ల మేర చేపపిల్లలు పంపిణీ చేయాలని ప్రభుత్వం టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొనే ఏజెన్సీలకు ప్రభుత్వం 80 ఎంఎం చేపపిల్లకు రూ.1.60, 35, 40 ఎంఎం చేపపిల్లకు రూ.0.60 చెల్లిస్తుంది. ఈమేరకు జూలై నెల మొదటి వారంలో టెండర్లు పిలిచారు. జూలై 23న టెండర్లు తెరవాల్సి ఉంది. టెండర్లు వేసేందుకు ఏజెన్సీలు ముందుకు రాలేదు. దీంతో ఈనెల 2వ తేదీన టెండర్లు తెరిచేందుకు గడువు పెంచారు. అయినప్పటికీ చేపపిల్లలు పంపిణీ చేసే కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేయలేదని సమాచారం.

బిల్లులు రాకపోవడమేనా..

గతేడాది జిల్లాలోని 435 చెరువుల్లో 138.27 లక్షల చేపపిల్లలు, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులో 40.33 లక్షల రొయ్య పిల్లలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చేప, రొయ్య పిల్లలు వదిలారు. ఏడాది గడిచినా ఏజెన్సీలకు ప్రభుత్వం డబ్బులు విడుదల చేయలేదని తెలిసింది. చేప, రొయ్య పిల్లల పంపిణీకి సంబంధించి రాష్ట్రంలో సుమారు రూ.70 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ కారణంతోనే ఏజెన్సీలు ఈ ఏడాది టెండర్లు దాఖలు చేయడానికి ముందుకురాలేదని తెలిసింది.

చేపల వేటతోనే ఉపాధి



మిడ్‌మానేరు ప్రాజెక్టుతోపాటు చెరువుల్లో వదిలిన చేపపిల్లలతో పలువురు మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. ఏటా ఆగస్టు నెల మొదటి వారంలోనే చేపపిల్లలు వదులుతారు. చేపపిల్లలు తొందరగా వదిలి ఉపాధి కల్పించాలి.

– జంగిటి బాలరాజు, మత్స్యకారుడు, జగ్గారావుపల్లి

చేపపిల్లలు విడుదల చేయాలి



మిడ్ మానేరు జలాశయంలో ప్రభుత్వం ద్వారా చేపపిల్లల విడుదలకు స్థానిక నాయకులు చొరవ తీసుకోవాలి. ఇప్పటికే అదును దాటుతోంది. ప్రాజెక్టులో వదిలిన చేపపిల్లలు పెరిగాక చేపల వేటతో కొదురుపాక కరీంనగర్ రోడ్డు పరిసరాల్లో చాలా మంది మత్స్యకారులు ఉపాధిపొందుతున్నారు.

– శ్రీనివాస్, మత్స్యకారుడు, కొదురుపాక

మంచంలోనే ఇంటి పెద్ద

- రెండు కిడ్నీలు పాడయిన వైనం
- చేతిలో చిల్లిగవ్వ లేక సాయం కోసం ఎదురుచూపు
- దాతలు స్పందించాలని వేడుకుంటున్న కుటుంబీకులు
- సిరిసిల్లలో డయాలసిస్ అవకాశం కల్పించాలని విన్నపం



మంచానపడ్డ ప్రణీత్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రెండు కిడ్నీలు పాడవడంతో ఆ ఇంటి పెద్ద మంచానికే పరిమితమయ్యాడు. అసలే పేదరికం.. ఆపై అనారోగ్యంతో చేతిలో చిల్లిగవ్వలేక చికిత్స చేయించుకోలేని దీన స్థితిలో ఉన్నాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన ప్రణీత్ తన అత్తగారి ఊరు ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో ఉంటున్నాడు. ప్రణీత్ రెండు కిడ్నీలు పాడయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లగా అక్కడ పరిచయమైన వ్యక్తి తనకు తెలిసిన వైద్యుడితో చికిత్స చేయిస్తానని.. రూ.15లక్షలు అవసరమని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి మాచారెడ్డిలో తనకున్న ఎకరం పొలంతోపాటు ఇంటిని విక్రయించగా వచ్చిన రూ.15లక్షలు అతనికి ముట్టజెప్పాడు. కొద్ది రోజులకు డబ్బులు తీసుకున్న వ్యక్తి మరణించడంతో ఏం చేయలేని దుస్థితిలో అత్తగారి ఊరు రాగట్లపల్లికి వచ్చి ఉంటున్నాడు. ప్రణీత్‌కు భార్య స్రవంతి, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. సిరిసిల్ల ఆస్పత్రిలో డయాలసిస్‌కు వెళ్తే బెడ్లు ఖాళీ లేవనడంతో కామారెడ్డికి వెళ్తున్నాడు. నెలలో నాలుగుసార్లు కామారెడ్డికి వెళ్లిరావడం ఇబ్బందిగా ఉందని, సిరిసిల్ల ఆస్పత్రిలో డయాలసిస్ అవకాశం కల్పించాలని వేడుకుంటున్నాడు. ప్రణీత్ దీనస్థితిని తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ బుధవారం రాగట్లపల్లికి వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. ప్రణీత్ పరిస్థితిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి కిడ్నీ చికిత్స జరిగేలా సహకరిస్తానని తెలిపారు. దాతలు స్పందించి ప్రణీత్‌ను ఆదుకోవాలని కోరాడు. దాతలు 63047 39822 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని కోరాడు.

ప్రతీ రైతు ఖాతాను పరిశీలించాలి

- చందుర్తి సొసైటీ పాలకవర్గం తీర్మానం

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు ఇచ్చిన రుణాలపై జిల్లా సహకార సంఘం అధికారులు పరిశీలించి, అవతకవతకలను బయటపెట్టాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. జిల్లా సహకార సంఘం అధికారి బుద్ధనాయుడు ఆదేశాలతో సొసైటీ చైర్మన్ తిప్పని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమయ్యారు. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన సీఈవో స్థానంలో డీసీవో కార్యాలయంలో పనిచేసే అధికారిని నియమించాలని తీర్మానం చేశారు. సొసైటీలో జరిగిన అక్రమాలకు బాధ్యులు ఎవరో తేల్చాలని కోరారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపడితేనే నిజాలు తెలుస్తాయని డైరెక్టర్లు అభిప్రాయపడ్డారు. జిల్లా సహకార సంఘం అసిస్టెంటు ఫీల్డ్ అధికారి అరుణజ్యోతి విచారణ కొనసాగించారు.

'పాలకవర్గ సభ్యులు రాజీనామా చేయాలి'

చందుర్తి సింగిల్‌విండోలో రుణాల్లో జరిగిన అవకతవకలకు పాలకవర్గం సభ్యులు బాధ్యులు అని మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య ఆరోపించారు. చందుర్తిలో బుధవారం మాట్లాడుతూ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రతీ మూడు నెలలకోసారి సమావేశమై ఆదాయ, వ్యయాలపై సమీక్షిస్తే అక్రమాలు జరిగేవి కావన్నారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి



సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల మండలంలో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించడం, ఉచిత విద్యుత్ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. అయితే అదే సమయంలో బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి మైలారం తిరుపతి, నాయకులు మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గుండెల్లి రవీందర్, చిదురుల రవిబాబు, కోడం రాంప్రసాద్ పాల్గొన్నారు.

'గుండాల'లో గల్లంతైన యువకుడు మృతి

తిర్యాణి: మండలంలోని గుండాల జలపాతంలో ఈ నెల 5న గల్లంతైన యువకుడు మృతిచెందాడని ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంగె రిషి ఆదిత్య(18) నలుగురు స్నేహితులతో కలిసి గత సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని గుండాల జలపాతాన్ని వీక్షించేందుకు వెళ్లాడు. అక్కడ పెద్ద బండరాయిపై నిల్చొని, ఫొటో దిగుతుండగా రుషి ఆదిత్య అదుపుతప్పి, జలపాతంలో పడిపోయాడు. తోటి మిత్రులు వెంటనే అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని, గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో రెండు రోజులు గాలించగా బుధవారం మృతదేహం లభ్యమైంది. కాగా, మృతుడు ఇటీవల పాలిటెక్నిక్ పూర్తి చేసి, బీటెక్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో జలపాతంలో పడి, చనిపోవడం, ఒక్కడే సంతానం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒక్క క్లిక్‌తో రూ.1.13 లక్షలు మాయం

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేటకు చెందిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ.1.13 లక్షలు మాయమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి కుమారుడు గల్ఫ్ నుంచి అతని యూనియన్ బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు పంపించాడు. ఈ నెల 4న బాధితుడి వాట్సాప్‌కు యూనియన్ బ్యాంక్ ఆధార్ అప్‌డేట్ అని లింక్ వచ్చింది. అతను క్లిక్ చేయగానే.. కొంత కొంత డబ్బు సుమారు 20 సార్లు కట్ అయ్యింది. మొత్తంగా రూ.1.13 లక్షలు పోయాయి. ఈ విషయాన్ని బాధితుడు ఆలస్యంగా గుర్తించాడు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగి ఖాతా నుంచి రూ.40 వేలు..

జగిత్యాల క్రైం/సారంగాపూర్: సారంగాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శివప్రసాద్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.40 వేలు మాయమయ్యాయి. మంగళవారం అతని వాట్సాప్‌కు ఓ లింక్ రాగా, బ్యాంక్ లోగోను పోలి ఉండటంతో క్లిక్ చేసి, ఏటీఎం వివరాలు నమోదు చేశాడు. అరగంట తర్వాత ఆయన ఖాతా నుంచి ఐదుసార్లు రూ.5 వేల చొప్పున, ఒకసారి రూ.15 వేలు మొత్తంగా రూ.40 వేలు పోయాయి. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు బుధవారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత అరెస్టు



అరెస్టు చూపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్(వేములవాడ): గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన కాసారపు వర్ధన్ గంజాయికి అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలనుకొని, తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, పలు గ్రామాల్లోని యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పోసానిపేట శివారులో ఎస్సై నవీన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో బైక్‌పై వస్తున్న వర్ధన్‌ను ఆపి, తనిఖీ చేయగా 160 గ్రాముల గంజాయి లభ్యమైంది. అతన్ని ఠాణాకు తరలించి, వివరాలు సేకరించారు. గంజాయితోపాటు బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. గంజాయి విక్రయించినా, సేవించినా కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో కోరుట్ల సీఐ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో 'స్వచ్ఛదనం' ప్రత్యేకాధికారి



స్వామివారిని దర్శించుకున్న ప్రత్యేకాధికారి శృతి ఝూ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వేములవాడ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమ రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ శృతి ఝూ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ ఈవో కొప్పుల వినోద్ రెడ్డి వారికి ఘనస్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం మహామంటపంలో అర్చకులచే ఆశీర్వచనం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, ఆలయ పర్యవేక్షకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్/తంగళ్లపల్లి: వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, నేరెళ్ల గ్రామాల స్కూళ్లను ఇంటర్మీడియెట్ బోర్డు సెక్రటరీ శ్రుతి ఓఝా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి బుధవారం పరిశీలించారు. కళాశాల తరగతి గదుల్లోకి వెళ్లి పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన అన్ని పుస్తకాలు వచ్చాయా? అని విద్యార్థులను అడిగారు. కళాశాలలో కావాల్సిన వసతులపై ప్రిన్సిపాల్ శరత్‌కుమార్‌ను అడిగారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ మహేశ్‌కుమార్ ఉన్నారు.

సౌదీ అరేబియాలో సిరిసిల్లవాసి సేఫ్

- ఎంబసీలకు లెటర్ రాసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- త్వరలో స్వదేశానికి రానున్న ఇమ్రాన్



సౌదీలో ఇమ్రాన్

వేములవాడ: సౌదీ అరేబియాలో ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ సోషల్ మీడియాలో చేసిన పోస్టుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించారు. ఇండియా, సౌదీ అరేబియా ఎంబసీలకు లెటర్ రాశారు. స్పందించిన అధికారులు ఇమ్రాన్‌ను త్వరలో స్వదేశానికి పంపించేందుకు అంగీకరించారు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్ 45 రోజుల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి, అక్కడి సూపర్‌మార్కెట్లో పనిలో చేరాడు. 15 రోజులకే పైల్స్ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో తనను ఇండియా పంపాలని యాజమాన్యాన్ని కోరగా అంగీకరించలేదు. పైగా తనను కొడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ వీడియో వైరల్ అవడం, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించి, ఎంబసీలకు లెటర్ పెట్టారు. దీంతో బుధవారం ఎన్ఆర్ఐ భైరాదేవ్ యాదవ్ ఇమ్రాన్‌ను కలిశారు. అతను స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్, ఖర్చులను భరిస్తానని విప్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం తాను సౌదీలో ఎన్ఆర్ఐ భైరాదేవ్‌యాదవ్ వద్ద సురక్షితంగా ఉన్నానని, రెండు, మూడు రోజుల్లో ఇండియాకు వస్తానంటూ ఇమ్రాన్ మరో వీడియో పోస్టు చేశాడు. సీఎం రేవంత్ రెడ్డికి, విప్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.



విప్ శ్రీనివాస్ రాసిన లెటర్

హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో చేరండి

- తెలుగు విశ్వవిద్యాలయంలో 60 సీట్లు
- దరఖాస్తు గడువు సెప్టెంబర్ 5



సిరిసిల్ల: రాష్ట్రంలో తొలిసారిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐటీహెచ్) కోర్సు ప్రవేశపెడుతున్నారు. మూడేళ్ల ఈ డిప్లొమా కోర్సును శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యార్ బుధవారం ప్రకటించారు. పదోతరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన యువకులు అర్హులన్నారు. జూలై 1వ తేదీ నాటికి బీసీ, ఇతర సాధారణ వర్గాల అభ్యర్థులకు 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్ల వయసు ఉండాలని తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 7వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు హిమజా కుమార్ ఓఎస్‌డీని 90300 79242 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గోదావరిఖనిలో జర్నలిస్టు ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): అందరికీ నమస్కారం .. నాకు ఇక సెలవు ఇప్పించండి.. అంటూ సూసైడ్ నోట్ రాసి, ఓ దినపత్రిక జర్నలిస్టు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన నాయిని మధునయ్య(63) కోల్‌బెల్ట్ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా పలు పత్రికల్లో పాత్రికేయునిగా పని చేస్తున్నారు. గతంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా, జర్నలిస్టుల సంఘం జాతీయ స్థాయి నాయకుడిగా ఉన్నారు. సింగరేణిలో క్లర్క్‌గా పని చేసి, నాలుగేళ్ల క్రితం రిటైరయ్యారు. తర్వాత పూర్తి స్థాయిలో పాత్రికేయ వృత్తికే అంకితమయ్యారు. ఈ క్రమంలో బుధవారం తెల్ల వారుజామున ఇంట్లోనే ఉరేసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు. తన చావుకు ఆర్థిక ఇబ్బందులు, కొందరు కారణమని రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌తోపాటు నా చిరకాల మిత్రులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశిక హరి, జర్నలిస్టులు వంశీ, రవీందర్‌రెడ్డి నా కుటుంబాన్ని ఆదుకోవాలని అందులో కోరారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

ఇద్దరిపై కేసు

జర్నలిస్టు మధునయ్య ఆత్మహత్య చేసుకున్న ఘటనపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకుండా తన తండ్రిని వేధింపులకు గురిచేశారని మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు చేశాడు. ఈ నెల 4న జరిగిన పంచాయితీలో డబ్బులు అడిగితే చంపుతామని పోచయ్య, లలిత బెదిరించారని పేర్కొన్నాడు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

చేనేత వస్త్రాలయం సందర్శన



దారపు కండెలు చుట్టడాన్ని పరిశీలిస్తున్న అల్ఫోర్స్ జీనియస్ విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఏడోతరగతి విద్యార్థులు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక చేనేత వస్త్రాలయాన్ని సందర్శించారు. దారపు కండెలు చుట్టడం, వస్త్రాలు నేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మానవాళికి వస్త్రాన్ని అందించిన ఘనత నేతన్నలదని తెలిపారు. మువ్వెన్నల జెండా నేసిన నేత కార్మికులను మనందరం గౌరవించుకోవాలన్నారు. చేనేత వస్త్రాలు ధరించి, వారికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో 'అల్ఫోర్స్' విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జీఆర్ఆర్ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కటా విభాగంలో జయరాం(ఐదోతరగతి) బంగారు, ఎన్‌పీ.కృష్ణచైతన్య (ఏడోతరగతి) రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. పాఠశాల కరిక్యులమ్‌లో భాగంగా విద్యతోపాటు క్రీడాంశాల్లో శిక్షణనిస్తూ పిల్లలు పతకాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులున్నారు.